www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 29 జనవరి 2025
5
అన్నమయ్య

గుర్తింపు రద్దు చేస్తాం : తహాశీల్దార్



మీసేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహాశీల్దార్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : ప్రభుత్వం నిర్ణయించిన సేవా రుసుం కంటే అధికంగా డబ్బులు వసూలు చేస్తే గుర్తింపు రద్దు చేస్తామని తహాశీల్దార్ పుల్లారెడ్డి అన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని పలు మీ సేవా కేంద్రాల్లో అయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాయచోటిలోని పలు మీ సేవా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన రుసుం కంటే ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో మాసాపేట మీ సేవా కేంద్రం, వివిధ కేంద్రాలలో తనిఖీలు చేశామని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన సేవా రుసుం కంటే అధికంగా డబ్బులు వసూలు చేస్తే మీ సేవా కేంద్రాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి, పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

వెలిగల్లు ప్రాజెక్టులో చేపలు వదులుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-గాలివీడు

మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మత్స్యశాఖ ఆధ్వర్యంలోమండలంలోని వెలుగల్లు ప్రాజెక్టులో 4.80 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మత్స్యకారుల సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం వారికి సబ్సిడీపై వలలు, బోట్లు, ఐస్ బాక్సులు మోటార్ సైకిల్ ఇచ్చి ఆదుకుంటున్నామని చెప్పారు. మత్స్యకారులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని మరింత అభివృద్ధి చెందాలన్నారు. మండలంలో దాదాపు 300 కుటుంబాలు చేపల వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని వారందరికీ తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రాబోయే మూడేళ్లలో వెలుగల్లు ప్రాజెక్టు ద్వారా నీటి సరఫరా చేసి శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 300 బోర్లు, మరియు మోటార్లు బిగించి గ్రామాలకు నీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. గత ప్రభుత్వంలో దౌర్జన్యాలు భూ అక్రమాలు అనేకం జరిగాయని ఈ ప్రభుత్వంలో అలాంటి వేమీ జరగవున్నారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం మంజూరు చేయించి ఇల్లు నిర్మిస్తామని తెలిపారు. హంద్రీ-నీవా కాలువలు అభివృద్ధి చేసి 22 వేల ఎకరాలకు సాగునీరు అందించి రైతులను ఆదుకుంటామని తెలిపారు. మండలంలో పనిచేసే రెవెన్యూ అధికారులందరూ రైతులకు అందుబాటులో ఉండి శాశ్వత భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు అవుతుందని ఈ ఎనిమిది నెలల కాలంలో ప్రజలు ఎటువంటి సమస్యలకు గురికాకుండా సుఖ సంతోషాలతో జీవిస్తున్నారన్నారు. ఇలాంటి మంచి ప్రభుత్వానికి రాబోయే రోజులలో ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మత్స్య శాఖ డిడి సుస్మిత, తహాశీల్దార్, ఎంపిడిఒ, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి : విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండిపల్లి నాగిరెడ్డి జ్ఞాపకార్థం ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ ఫెడరేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన మెగా టాలెంట్ టెస్ట్ విజేతలకు మంత్రి చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపైనే కాకుండా క్రీడలలో కూడా రానించి శరీర దారుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు.

ప్రజాదర్బార్ అర్జీలను నిర్లక్ష్యం చేయొద్దు

చిన్నమండెం : అధికారులు ప్రజాదర్బార్ కార్యక్రమంలో వచ్చే అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యం వల్ల జిల్లాలో సమస్యలు అధికంగా ఉన్నాయని అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో వచ్చే అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించి బాధితులకు న్యాయం చేయా లన్నారు. అనంతరం నాగిరెడ్డిపల్లెలో రూ.32 లక్షలతో మంజూరైన సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. నాగిరెడ్డి కాలనీ నీటి సమస్య పరిష్కారానికి నూతన బోరును ప్రారంభించారు. ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు వేస్తామన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

లక్కిరెడ్డిపల్లె : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయనిమంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలో నిర్వహించిన మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ప్రతి ఒక్కరు క్రీడలలో పాల్గొని తమ శరీర దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. మండలంలో మండల యువ నాయకులు షేక్ అరీఫుల్లా ఆధ్వర్యంలో బాస్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ నెల 28, 29, 30వ తేదీల్లో జరిగే ఈ టోర్నమెంట్లో లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు, చక్రాయపేట, మండలాలలోని క్రీడాకారులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. ఈ పోటీలలో ఓడిన వారు నిరుత్సాహం చెందకుండా రాబోయే క్రీడలలో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. టోర్నమెంట్‌లో మొదటి బహుమతిగా రూ.25 వేలు, రెండవ బహుమతి రూ.15 వేలు, మూడవ బహుమతి రూ.ఏడు వేలు విజేతకు ఇస్తామన్నారు. కార్యక్రమంలో మండల యువ నాయకులు యనమల మదనమోహన్, ఎపిఐఐసి మాజీ చైర్మన్ ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, బాబురెడ్డి, జెకె, కాల్వ ఆంజనేయులు పాల్గొన్నారు.

'కస్తూర్బా'ను గాలికొదిలేసిన డిఇఒను సస్పెండ్ చేయాలి

- సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కస్తూర్బా గురుకుల పాఠశాలలో విద్యార్థుల చేత చాకిరీ చేయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, గురుకుల పాఠశాలలను గాలికి వదిలేసిన డిఇఒను, జిసిడిఒలను సస్పెండ్ చేయాలని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు గురుకుల పాఠశాలలో అనేక అక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పిటిఎం గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ఎస్ఒ విద్యార్థుల చేత వెట్టిచాకిరి చేపించుకోవడమే కాకుండా కులం పేరుతో బూతులు తిడుతూ వేధింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. ములకలచెరువు గురుకుల పాఠశాలలో చాకిరీ చేయంచుకుంటూ స్నానం చేయాలంటే రూ.వంద, సౌకర్యాలు కావాలంటే రూ.500 వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని వివరించారు. ఇంత జరుగుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారి, గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ అధికారులు నిమ్మకు నీరేతినట్లు వ్యవహారిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కస్తూరిబా గురుకుల పాఠశాలల నుండి భారీగా ముడుపులు వస్తున్నందునే జిల్లా డిఇఒ, జిసిడిఒలు అటువైపు కన్నెత్తి చూడటం లేదనే అనుమానం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కస్తూర్బా గురుకుల విద్యాలయాల్లో వెట్టి చాకిరీ, వేధింపులు, అక్రమాలు జరుగుతున్నాయి పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరిశర్మ, రాజేష్, పాల్గొన్నారు.

'కస్తూర్బా' సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

రాజంపేట అర్బన్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న కస్తూర్బా పాఠశాలల్లోని సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ సర్వేపల్లి డిమాండ్ చేశారు. ములకలచెరువులోని కస్తూర్బా పాఠశాలలో తనిఖీలు నిర్వహించిన సామాజిక బృందానికి విస్తుపోయే వాస్తవాలు బయటపడ్డాయని, ఆ సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. కస్తూర్బా పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐటిఐ కళాశాలలో మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కస్తూర్బాపాఠశాలలో తనిఖీలు లేకపోవడంతో అడ్డు, అదుపు లేకపోవడంతో ఉపాధ్యాయులు, వర్కర్ల మధ్య విభేదాలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రశ్నిస్తే మార్కులు తగ్గిస్తామని బెదిరిస్తున్నారని అధికారుల విచారణలో విద్యార్థులు వాపోయారని సామజిక తనిఖీ బృందం విస్మయం వ్యక్తం చేశారన్నారు. కస్తూర్బా పాఠశాలలోనే గత సంవత్సర కాలంలో చిన్నమండెం, ఓబులవారిపల్లి, పుల్లంపేట, వీరబల్లి, అనేక ప్రాంతాల్లో ఇదే పద్ధతిలో ఉన్నప్పటికీ అధికారులు నామమాత్రంగా తనిఖీలు చేసి వారికి కావాల్సిన ముడుపులు తీసుకుని అదేచోట గత విద్యాశాఖ అధికారులు పోస్టింగ్ ఇచ్చి కొనసాగిచ్చేటువంటి పరిస్థితి ఉందన్నారు. తక్షణమే కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న కెజిబివి, ఎపిఆర్‌జెసి, మినీ గురుకులాలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల సమస్యలపై కమిటీ వేయాలన్నారు. విద్యార్థుల ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి ఆ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అలా లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మదన్ మోహన్‌రెడ్డి, రాజంపేట ఎస్ఎఫ్ఐ నాయకులు వై.వెంకటేశ్వర, పురుషోత్తం, బాలాజీ, విష్ణువర్ధన్, గోపీచంద్, యశ్వంత్ పాల్గొన్నారు.

రాజంపేట : నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థినులను వేధిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

రాయచోటి : ములకలచెరువు కస్తూర్బా పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులను తీవ్ర ఇబ్బందులు, వేధింపులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా నాయకులు సాయినాయక్ డిమాండ్ చేశారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సోమవారం సామాజిక తనిఖీ బృందం చేయగా తల్లిదండ్రుల సమక్షంలోనే నిజానిజాలు వెలుగులోకి వచ్చాయన్నారు. తమను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నట్లు విద్యార్థినులు అధికారులు ఎదుట వాపోయారున్నారు. ప్రధానంగా విద్యార్థినులకు నెలసరి సమయాల్లో శానిటరీ ప్యాడ్‌లు ఇవ్వమని అడుగుతే పీరియడ్స్ చూపించమని అక్కడ పనిచేసే కస్తూరిబా పాఠశాల సిబ్బంది అడగడం దారుణమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి, సర్వ శిక్ష అభియాన్ అధికారులు పర్యవేక్షణ లేకనే ఇలాంటి ఘటన చోటుసుకుందన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా రవీంద్ర, మహేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన అవసరం

- నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి మణికంఠ

ఎంవిఐకి మెమోంటో అందజేస్తున్న మణికంఠ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

గ్రామీణ ప్రాంతాల పరిధిలోని యువత ట్రాఫిక్ నియమ నిబంధనపైన తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి మణికంఠ పేర్కొన్నారు. మంగళవారం పట్టణం పరిధిలోని బిట్స్ కళాశాల ప్రాంగణంలో రోడ్డు భద్రత నియమాల పైన భారత ప్రభుత్వం నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం ద్వారా విలువైన ప్రాణాలను కోల్పోకుండా కాపాడిన వారమవుతామని తెలిపారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రమాదాల బారిన పడకుండా హెల్మెట్లు ధరించాలని సూచించారు. విలువైన ప్రాణాలు కోల్పోవడం ద్వారా కుటుంబం చిన్నా భిన్నం అవుతుందని పేర్కొన్నారు. తమ ప్రాణాలను కాపాడుకుంటూ కుటుంబానికి భరోసా కల్పించాలని సూచించారు. యువత ఆవేశం తగ్గించుకొని ఆలోచన వైపు నడవాలని పేర్కొన్నారు. చిన్న చిన్న నియమాలు పాటించడం ద్వారా జీవితానికి భరోసా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలకాలన్నారు. అనంతరం విద్యార్థులకు టీ షర్టు, టోపీలు, ట్రాఫిక్ రూల్స్ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ భాస్కర్, ప్రిన్సిపాల్ నాగేంద్ర, సురేంద్రారెడ్డి, నెహ్రూ యువ కేంద్ర సంస్థ సభ్యులు బాలాజీ, లక్ష్మీ నారాయణ, సుబ్బయ్య పాల్గొన్నారు.

ఎపిఎండిసి టెండర్‌ను రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని ఎపిఎండిసి స్కూల్లో టెండర్‌ను పిలిచి ఎపిఎండిసి యాజమాన్యం వారు అక్రమ పద్ధతిలో ఒక స్కూల్ కాంట్రాక్టర్‌కి కోర్టులో కట్టబెట్టడం చట్టరీత్యా నేరమని ఈ అక్రమ స్కూల్ కాంట్రాక్టును రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు డిమాండ్ చేశారు. మంగళవారం సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్ అధ్యక్షతన రెండో రోజు ఎపిఎండిసి స్కూల్ గేటు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా రామాంజులు మాట్లాడుతూ అకారణంగా తొలగించిన సబ్ స్టాఫ్ 10 మంది పారిశుధ్య విభాగంలో మూడు సంవత్సరాల నుండి మహిళలు కేవలం రూ.ఎనిమిది వేలతో పని చేస్తూ ఉంటే వారిని జనవరి ఒకటో తేదీ నుండి నోటిమాట ద్వారా విధులకు రావద్దని స్కూలు యాజమాన్యం నిర్ధాక్షిణంగా గెంటివేయడం బాధాకరమన్నారు. వీరికి ఐడి కార్డ్, బ్యాంక్ అకౌంట్ అటెండెన్స్ మాస్టర్ కూడా ఉన్నదని పేర్కొన్నారు. 20 రోజులుగా కాంట్రాక్టర్‌ని యాజమాన్యంను వేడుకుంటున్నా కూడా ఫలితం లేక రిలే నిరాహార దీక్ష చేపట్టినట్లు తెలియజేశారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. స్కూలు పిల్లలు 500 మంది ఉన్నప్పుడు తీసుకున్నారని ఇప్పుడు 1100 మంది పిల్లలు ఉంటే స్వీపర్ల సంఖ్య పెంచాలని ఉన్నవారిని తొలగించడం అన్యాయమని మిగతా వారి మీద పని భారం ఒత్తిడి ఎక్కువవుతుందని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఉన్న ఉద్యోగాలు తొలగిస్తూ కాంట్రాక్టర్లకు వంతపాడడం ఉపసంహరించుకోవాలని తెలియజేశారు. విధుల్లోకి తీసుకునేంత వరకు సిఐటియు కార్మికులకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ స్టాఫ్ మహిళలు లత, చిట్టెమ్మ, లక్ష్మీదేవి, ప్రసన్న, వరలక్ష్మి, మౌనిక, రాణి, బేబీ పాల్గొన్నారు.

రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న సిఐటియు నాయకులు

రిజిస్ట్రేషన్ ఛార్జీలపై పునరాలోచించాలి : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పెంచిన భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీల భారంపై పునరాలోచన చేయాలని ప్రభుత్వాన్ని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు మళ్లీ రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచడం వల్ల రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పకూలి, నిర్మాణ రంగంపై ప్రభావం పడుతుందన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎనిమిది నెలల నుంచి ప్రజలకు ప్రభుత్వం ఏ మేలు చేయకకుండా వారి పార్టీ నాయకుల స్వార్థమే ఆలోచిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో రూ.14 లక్షల కోట్లును గత ప్రభుత్వం అప్పులు చేసిందని దుష్ప్రచారం చేశారన్నారు. ఇప్పుడు రూ.6 లక్షల కోట్లు అప్పులు మాత్రమే తేలాయన్నారు. ఇప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు, తాను ఏమిచేయలేను, ఇచ్చిన హామీలను అమలు చేయలేమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే స్వయంగా చెప్పుతున్నారంటే వారి చిత్తశుద్ధి అర్థమవుతోందన్నారు. అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఆటంకం కలిగిస్తోందన్నారు. జగన్ హయాంలో 17 మెడికల్ కళాశాలలను కడితే, ఈ ఏడాదిలో వచ్చిన మెడికల్ కళాశాలలకు సీట్లు అవసరం లేదని కేంద్రానికి చంద్రబాబు నాయుడు చెప్పారన్నారు. జగన్ బ్రహ్మాండమైన సచివాలయాలను కట్టి ఉద్యోగాలను కల్పించారని, ఆ ఉద్యోగాలకు ఈ ప్రభుత్వం కోత పెడుతోందని విమర్శించారు. వేలాది చీకటి జీవోలు ఇస్తున్నారని పేర్కొన్నారు. సంపద సృష్టించి తాము ప్రజలకు పంచుతామని అనేక మార్లు చంద్రబాబు చెప్పుతున్నారన్నారు. చేతగాక ప్రజలపై భారాలు మోపుతారా అని ఆయన ప్రశ్నించారు. అమరావతి పరిధిలో 29 గ్రామాల్లో భూముల విలువలు పెంచకుండా నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆర్‌డిఒ స్థాయి లేని రాయచోటి జిల్లా కేంద్రం కావడంతో పట్టణానికి చుట్టుప్రక్కల ఉండే భూముల విలువలు పెరిగాయన్నారు. సంక్షేమ పథకాలకు బటన్ ఎవరైనా నొక్కుతారని గత ప్రభుత్వంపై చంద్రబాబు హేళనగా మాట్లాడారని ఆయన గుర్తు చేశారు. సంక్షేమం, అభివృద్ధిని సమంగా ఎందుకు చేయలేకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచిందని, పన్నుల భారం భారీగా మోపిందని తెలిపారు. మెగా డిఎస్‌సిపై చంద్రబాబు నాయుడు మొదటి సంతకం చేశారని, ఆ మొదటి సంతకానికే దిక్కులేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ఏ వర్గం ప్రజలు సంతోషంగా లేరన్నారు. ముఖ్యంగా నిర్మాణ రంగాన్ని దృష్టిలో ఉంచుకుని భూముల రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచకుండా యథావిధిగా కొనసాగించాలని తెలిపారు.

అసోసియేషన్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు ప్రశంసనీయమని సత్యసాయి జిల్లా సమన్వయకర్త నాగేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం మదనపల్లెకు వచ్చిన ఆయన సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు ముని గోపాలకృష్ణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగేంద్రరెడ్డి, శమంతకమణి దంపతులకు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలను వివరించారు. సీనియర్ సిటిజన్ల సమస్య లను పరిష్కరించడంలో చూపుతున్న చొరవ, అవలంబిస్తున్న విధానాలను తెలియజేశారు. సుప్రీం కోర్టు వయో వృద్ధుల సంక్షేమం కోసం ఇచ్చిన తీర్పుకు విస్తృత ప్రచారం కల్పిస్తూ అవగహన పెంచుతున్నట్లు పేర్కొన్నారు. వయోవృద్ధుల ఆరోగ్యం విషయంలో అధిక ప్రాధాన్యతనిస్తూ వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అదేక్రమంలో కనువిప్పు లఘు చిత్రం ద్వారా వయోవృద్ధుల ఆర్థిక ఇబ్బందులను ఎలా అధిగమించ వచ్చో చైతన్య పర్చడం జరుగుతోందన్నారు. నాగేంద్రరెడ్డి మాట్లాడుతూ తాము కూడ విశ్రాంత విద్యాశాఖ అధికారిగా వయోవృద్ధుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

శరవేగంగా డ్రెయినేజీ, సిసి రోడ్ల నిర్మాణం

- మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై ప్రత్యేక దృష్టి సారించామని మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. పలువురు వార్డు కౌన్సిలర్లు తమ వార్డుల పరిధిలో నెలకొన్న సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకురాగా, వాటిని సాధ్యమైన మేర పరిష్కరిస్తామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల జీవితాలతో యూనియన్ నాయకులు చెలగాటమాడుతున్నారని, కొందరు కార్మికులు విధులకు హాజరవుతున్నా, వారికి హాజరు వేయడం లేదన్నారు. కార్మికులు వద్ద నుండి ప్రతినెల డబ్బులు వసూలు చేస్తు న్నారని దీనిని అరికట్టాలని తెలిపారు. అనంతరం మరో వైస్ చైర్మన్ నూర్ అజాం మాట్లాడుతూ పట్టణంలో వీధి కుక్కల బెడద అధికమైందన్నారు. వయసు మీరిన వారు, పిల్లలు రోడ్లపై వెళ్తుంటే వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయన్నారు. కుక్కలను నిర్మూలించే చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై చైర్‌పర్సన్ మాట్లాడుతూ కౌన్సిల్ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా సహాయ సహకారాలతో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పట్టణ ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జగన్ ఫొటో తొలగించాలి : టిఎన్ఎస్ఎఫ్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మున్సిపల్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఫొటోను తొలగించాలని టిఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, తెలుగు యువత పార్లమెంట్ అధికార ప్రతినిధి పాండురాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారుగా 8 నెలలు అయినా మున్సిపాలిటీ కార్యాలయంలో మాజీ సిఎం జగన్ ఫోటోలు తొలగించలేదని పేర్కొన్నారు. అనేక మార్లు కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చినా కూడా స్పందన లేదన్నారు. రాతపూర్వకంగా వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వైసిపి నాయకులకు తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జగన్ ఫొటో తొలగించి ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫోటోలు పెట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మున్సిపాలిటీ కార్యాలయం ముందు టిఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, తెలుగు యువత నాయకులు తేజల ఆనంద్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో ఎన్‌సిసి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య యూనివర్సిటీలో మంగళవారం నుంచి మూడు రోజులు పాటు విద్యార్థులకు ఎన్‌సిసి శిక్షణ శిబిరం నిర్వహించామని కళాశాల ప్రిన్సిపల్ ఎస్.ఎం.వి.నారాయణ తెలిపారు. ఈ శిబిరానికి 5 ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ తిరుపతి వారు నాయబ్ సుబేదార్, యు.వెంకటేష్, సిహెచ్‌ఎం కర్నాల్ సింగ్ శిక్షకులుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, శారీరక దృఢత్వం, సామాజిక సేవా దృక్పథం అభివృద్ధి చేయడానికి అవసరమైన అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో 150 మందికి పైగా విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ ఫిబ్రవరిలో నిర్వహించనున్న ఎన్‌సిసి 'బి', 'సి' సర్టిఫికెట్ల పరీక్షల కోసం విద్యార్థులు సమర్థం చేయడంలో దోహదపడుతుందని వివరించారు. కళాశాల వైస్ చైర్మన్ చొప్ప ఎల్లారెడ్డి, రిజిస్ట్రార్ ఎన్.మల్లిఖార్జున రావు, ఫిజికల్ డైరెక్టర్ నాగముని, ఎన్‌సిసి సిటిఒ దీప్తి, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ సైపుల్లాలు అభినందించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ఎన్‌సిసి విద్యార్థులు, తదితరలు పాల్గొన్నారు.

మిస్సింగ్ సిటిజన్ సర్వే పూర్తికి చర్యలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాలలో మిస్సింగ్ సిటిజన్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని మదనపల్లె ఎంపిడిఒ తాజ్ మస్రూర్ ఎఎన్ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మదనపల్లె మండల పరిధిలోని ఎఎన్ఎంలతో ఎంపిడిఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ తాజ్ మస్రూర్ మాట్లాడుతూ కుటుంబంలో ఉన్న పెద్దవాళు ప్రత్యేక రేషన్ కార్డు కలిగి ఉంటున్నారని పేర్కొన్నారు. వారు ఏ కుటుంబానికి చెందినవారో త్వరగా గుర్తించాలన్నారు. ముఖ్యంగా ఆరోగ్యశ్రీ కింద ఎవరెవరైతే లబ్ధి పొందారో, వారి కుటుంబ వివరాలు, వారు లబ్ధి పొందుతున్న సంక్షేమ పథకాల వివరాలను తెలుసుకొని నివేదికను త్వరగా కార్యాలయానికి చేర్చాలన్నారు. సర్వే సమయంలో క్షేత్రస్థాయిలో ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించి సర్వే పూర్తి చేసేందుకు అనువైన మార్గాన్ని సూచిస్తామన్నారు. విధుల్లో ఎవరూ అలసత్వం వహించద్దని ఇచ్చిన టార్గెట్లను లక్ష్యంగా పనిచేయాలన్నారు. నిర్లక్ష్యంగా పనిచేసిన సర్వే పూర్తి చేయకపోవడానికి కారణాలు చూపిన ఉపేక్షించేది లేదన్నారు. కావున ప్రభుత్వ ఆదేశాల మేరకు మిస్సింగ్ సిటిజన్ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు.

ఫేర్వెల్ పార్టీ జ్యోతి ప్రజ్వలనలో ముఖ్య అతిథులు

క్రమశిక్షణ, పట్టుదల విజయానికి సోపానాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

క్రమశిక్షణ, పట్టుదల విజయానికి సోపానాలని మదనపల్లె ఎంవిఐ శివలింగయ్య, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ సి.రామలింగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఓ కన్వెన్షన్ సెంటర్‌లో శ్రీసాయి చైతన్య జూనియర్ కళాశాల ఫేర్వెల్ పార్టీ అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఇంటర్మీడియట్ ఎంతో కీలకమన్నారు.కావున విద్యార్థులు చెడుస హవాసాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. అధ్యాపకులు చెప్పిన పాఠాలను చక్కగా అవగాహన చేసుకుని అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. పట్టుదలతో చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించి అటు కళాశాల యాజమాన్యానికి, ఇటు తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. తమ ప్రయాణంలో అడ్డంకులు ఎదురైనా వాటిని అధిరోహించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాల చైర్మన్ కె.నిర్మల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేర్చాలన్నారు. చెడు అలవాట్లు దూరంగా ఉండి, ఓర్పు, సహనం, కృషి, పట్టుదల వంటి మంచి లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. ప్రతి ఏడాది తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నారని, ఇది కళాశాలకు, వారి తల్లిదండ్రులకు గర్వకారణమన్నారు. కళాశాల విద్యార్థులకు విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలలో ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలన్నారు. తమ ఆహ్వానం మేరకు ఫేర్వెల్ పార్టీకి విచ్చేసిన అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విజయభారతి విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.సేతు, జ్ఞానోదయ హైస్కూల్ కరస్పాండెంట్ కామకోటి ప్రసాదరావు, సెవెన్ హిల్స్ హైస్కూల్ కరస్పాండెంట్ రఘునాథ్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ రామ్మూర్తి, విజేత శంకర్ యాదవ్, పురుషోత్తం, ప్రణీత్‌రెడ్డి, గాయత్రి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ శంకర్‌రెడ్డి, ఆదిత్య కళాశాల వైస్ ప్రెసిడెంట్ రాజేశ్వర్ రెడ్డి, ప్రిన్సిపల్ ధనుంజయ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ నరసింహులు, ఎఒ ఆనందరెడ్డి మరియు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రిసోర్స్ పర్సన్ ఆనంద్ కుమార్

మహిళా జాగృతికి న్యాయ సదస్సులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మహిళలు మోసపోకుండా జాగృతం చేసేందుకు న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహిస్తున్నట్లు రిసోర్స్ పర్సన్స్ ఆనందకుమార్, సుబ్బరామయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సభా భవనంలో నిర్వహించిన సదస్సులో వారు మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గృహహింస, వరకట్న వేధింపులు, మహిళల పట్ల క్రూరత్వం, లైంగిక వేధింపులు, అపహరణ, యాసిడ్ దాడి, అత్యాచారం, గ్యాంగ్ రేప్, మహిళలకు సమాన పనికి సమాన వేతనం, సమాన వేతన చట్టం, ఫ్యాక్టరీల చట్టంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. మహిళల ఫిర్యాదులను పరిష్కరించడంలో ఎన్‌సిడబ్ల్యూ పాత్ర, విధులు, మహిళల మనోవేదనలను పరిష్కరించడంలో నల్సా పాత్రను వివరించారు. మానవ అక్రమ రవాణా, వన్ స్టాప్ సెంటర్ (సఖి), లక్ష్యాలు, అప్లికేషన్, ఎమర్జెన్సీ రెస్పాన్స్, రెస్క్యు సర్వీసెస్, వైద్య సహాయం, పోలీసు సహాయం గురించి తెలియజేసినట్లు చెప్పారు. మహిళలు జాగ్రత్తగా ఉండేందుకు న్యాయ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రధానంగా మహిళా చట్టాల గురించి వారు క్షుణ్ణంగా వివరించారు. మహిళ చైతన్యవంతురాలు అయినప్పుడే కుటుంబం సమాజం సౌభాగ్యవంతంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ ఆనంద్ కుమార్, సుబ్బరామయ్య, తహశీల్దార్ అరవింద్ కిషోర్, ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్, ఎఒ శ్రీధర్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి ముత్తయ్య, ఆర్ఐ సుశీల్ కుమార్, ఎపిఎం సుబ్బలక్ష్మమ్మ, పోలీస్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

రైతులకు ఎంఎంసి, జిగురు అట్టల పంపిణీ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజు పేట ఉద్యాన పరిశోధన స్థానం ఆధ్వర్యంలో రైతులకు మంగళవారం అర్కా మైక్రోబియల్ కన్సార్షియం వారు జిగురు అట్టలు పంపిణీ చేశారు. ఎస్‌సి ఉప ప్రణాళిక పథకం,అఖిల భారత సమన్వయ పథకంల కింద 20 మందికి మండలంలోని ఓబనపల్లి గ్రామంలో రైతులకు అందించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు సందీప్‌నాయక్, యోహాన్ మాట్లాడుతూ బొప్పాయి పంట తరువాత ఎకరాకు 15 నుంచి 20 చొప్పున జిగురు అట్టలు అడుగు ఎత్తున పెట్టడం వల్ల రసం పీల్చే పురుగుల ఉధృతి తగ్గించవచ్చని అన్నారు. ఎఎంసి జీవన ఎరువును 1 కేజీ 100 కేజీల పశువుల ఎరువుతో కలిపి మొక్కల మొదళ్ల వద్ద వేయడం వల్ల మొక్కకి పోషకాలు అందుతాయని అన్నారు. కార్యక్రమంలో ఎడిఎ కవిత, మండల వ్యవసాయ,ఉద్యాన అధికారులు సుధాకర్, భాస్కర్,లక్ష్మి నారాయణ, సుధాకర్ వర్మ పాల్గొన్నారు.

ఎంఇఒకు సన్మానం

ప్రజాశక్తి-పుల్లంపేట

రిపబ్లిక్‌డే వేడుకల్లో కలెక్టర్ చేతులమీదుగా ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిగా ప్రశంసా పత్రం అందుకున్న చక్రధర్ రాజును మంగళవారం మండల ఎస్‌టియు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌టియు నాయకులు మాట్లాడుతూ ఉత్తమ మండల విద్యాశాఖ అధికారిగా ఎంపికైన చక్రధర్ రాజుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు బుధారపు నరేంద్రనాథ్, మండల అధ్యక్షుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి వల్లూరు సిద్దయ్య, మండల నాయకులు మునగపాటి శ్రీనివాసులు, గౌస్, అశోక్ కుమార్, హేమలత, ప్రమీల పాల్గొన్నారు.

కోడూరులో అధ్యాపకుడికి..

రైల్వేకోడూరు : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కె.ప్రసాద్ వర్మ జిల్లా ఉత్తమ గ్రంథాలయ అధ్యాపకుడిగా కలెక్టర్‌ను నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపల్ వై.నరసింహమూర్తి, అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది ఆయనను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. అధ్యాపకులు ఆయన సేవలను నిబద్ధతను గురించి విద్యార్థులకు తెలియజేస్తూ, ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రశంసించారు.

పదవ తరగతి మోడల్ పేపర్స్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ

పదవ తరగతి మోడల్ పేపర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని మండల విద్యాశాఖ అధికారి కేంద్రంలో ఎంఇఒ చక్రధర్ రాజు యుటిఎఫ్ రూపొందించిన 10వ తరగతి మోడల్ పేపర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ పదవ తరగతి చదువుతున్న పిల్లలకు ఈ మోడల్ పేపర్స్ ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో మండల వ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరూ చక్కగా రాసి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని తెలియజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రమణ, రమణమూర్తి, శంకరయ్య, నరసయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాలంటరీ టీచర్స్‌కు ఒకరోజు శిక్షణ

ప్రజాశక్తి-చిన్నమండెం

తంబళ్లపల్లె: మాట్లాడుతున్న ఎంఇఒ

మండల పరిధిలోని 380 మంది వయోజనులకు చదువు చెప్పడానికి మంగళవారం వాలంటీర్ టీచర్స్‌కు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. స్థానిక ఎంపిడిఒ శేఖర్ నాయక్ మాట్లాడుతూ మండలంలో మొత్తం 380 మంది నిరక్ష్య రాసులు ఉన్నారని, వీరికి చదువు చెప్పడానికి 38 మంది వాలంటరీ టీచర్స్‌ను గుర్తించి వారికి చదువు చెప్పడంలో పద్ధతులను గురించి వివరించినట్లు తెలిపారు. వాలంటీర్ టీచర్స్ కు ఒక హ్యాండ్‌బుక్, నిరక్ష్యరాసులకు ఒక వాచకం, హాజరు రిజిస్టర్, 2025 కేలండర్‌ను పంపిణీ చేశారు. అన్ని కేంద్రాలు మంగళవారం నుంచి పని చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎపిఎం,వెలుగు సిసిలు, వయోజన విద్య సూపర్‌వైజర్, టీచర్స్ పాల్గొన్నారు. **తంబళ్లపల్లె:** వయోజన విద్యాశాఖ డిఆర్‌డిఎ సహకారంతో నిరక్షరాశులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ విద్య బోధనపై శిక్షణా తరగతులు జరిగాయి. ఎంపిడిఒ కార్యాలయంలో సిసిలు, సంఘమిత్రలు, వాలంటీర్ టీచర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎపిఒ గంగాధర్ మాట్లాడుతూ మండలంలో 48 కేంద్రాలు గుర్తించారు. ఈ కేంద్రాలలో మహిళా సంఘాలలోని నిరక్షరాశుల మహిళలను గుర్తించి వారిని అక్షరాసులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రతి కేంద్రంలోనూ 10 మంది నిరక్షరాశులకు ఈ విద్యాబోధన కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమాన్ని 45 రోజులపాటు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ త్యాగరాజు, ఇఒపిఆర్‌డి దిలీప్ కుమార్, ఏమో థామస్, మండల సమైక్య అధ్యక్షురాలు రామలక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటి కోసం అవస్థలు

- మరమ్మతులకు నోచని బోరు
- పట్టని అధికారులు
- పరిష్కరించాలని గ్రామస్తుల వేడుకోలు

మరమ్మతులకు నోచని తాగునీటి బోరు

ప్రజాశక్తి-సుండుపల్లి

తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని, స్కీం బోరుకు మరమ్మతు చేయించాలని సుండుపల్లె గ్రామపంచాయతీ, కమ్మగుట్టపల్లె గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మీ పల్లెకు తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయిస్తాం, సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేస్తామని రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చి వెళతారని కానీ ఎన్నికలు అయిపోయిన తర్వాత మాగ్రామంలోకి తొంగి కూడా చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో బోరు చెడిపోయిందని దాన్ని మరమ్మతులు చేస్తామని చెప్పి నేటి వరకు చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారుగా 70 కుటుంబాలు ఈ గ్రామంలో నివసిస్తున్నారని, తాగునీటి బోరుకు చెడిపోవడంతో గ్రామానికి ఒకటే చేతి పంపు ఉందని, అది కూడా ఎప్పుడు చెడిపోతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నాం

గ్రామంలో 8నెలలుగా తాగునీటి బోరు చెయిపోయింది. తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం. ఉన్న చేతిపంపుపైనే ఆధారపడుతున్నాం. రాజకీయ నాయకులు ఎన్నికల సమయంలో తాగునీటి బోరుకు మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఇంత వరకు పట్టించుకోలేదు. మండల, గ్రామ పంచాయతీ అధికారులకు తెలియజేసిన పట్టించుకునే వారే లేదు. ఇప్పటికైనా తాగునీటి బోరుకు మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

- రాములమ్మ, కొత్తపల్లి

70 కుటుంబాలకు ఒక్కటే స్కీమ్ బోరు

గ్రామంలో 70 కుటుంబాలకు సుండుపల్లి-గుంతరాచపల్లి ప్రధాన రోడ్డు పక్కన ఒక్కటే స్కీమ్ బోరు ఏర్పాటు చేశారు. తాగునీటి బోరు చెయి పోయి దాదాపు 8 నెలలు అవుతుంది. ఇంతవరకు ఏ పంచాయతీ అధికారులుగానీ, మండల అధికారులు గానీ, నీటిపారుదల శాఖ అధికారులుగానీ పట్టించు కోలేదు. తాగునీటి కోసం అష్టకష్టాలు పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధిలు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

-నాగములమ్మ, కమ్మగుంటపల్లె

కెజిబివిలో ప్రహరీ ఏర్పాటు చేయాలి

ఇంటర్‌లో ఎంపిసి, బైపిసి గ్రూపులు చేర్చండి
సామాజిక తనిఖీ బృందానికి పాఠశాల కమిటీ వినతి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం

మండల పరిధి ముష్టూరు గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం లో సోషియల్ ఆడిటర్, డిస్ట్రిక్ రిసోర్స్ పర్సన్ ఎస్.పృధ్విరాజ్ నేతృత్వంలోని సామాజిక తనిఖీ బృందం మూడురోజుల పాటు తనిఖీ నిర్వహించినట్లు ప్రిన్సిపల్ మునివెంకటమ్మ తెలిపారు. పాఠశాల కార్యకలాపాలను, రికార్డులను, ఉపాధ్యాయ, విద్యార్థుల రిజిస్టర్లను, సామగ్రి నిల్వ గదులను, వంటశాలలను, వంట సామగ్రిని, లైబ్రరీ, ల్యాబ్, తరగతి గదులను, విద్య సామగ్రిని, విద్యార్థులలో విద్యాసామర్థ్యాలతో పాటు ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. విద్యార్థులతో స్వయంగా సమస్యలు తెలుసుకోవడానికి ముచ్చటించారు. మంగళవారం పాఠశాలలో పాఠశాల ఎస్ఎంసి కమిటీ, విద్యార్థుల తల్లి దండ్రులతో కలసి గ్రామసభను నిర్వహించి పాఠశాల నిర్వహణ, వసతులు, సమస్యలపై సూచనలు, సలహాలను స్వీకరించారు. ఎస్ఎంసి కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ కెజిబివి పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలన్నారు. సిసి కెమెరాలు పనిచేయడం లేదని వాటిని మరమ్మతులు చేయించాలన్నారు. ఇంటర్మీడియట్ ప్రస్తుతం ఉన్న సిఇసి గ్రూపుతో పాటు విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం ఎంపిసి, బైపిసి వంటి గ్రూపులను కూడా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. తద్వారా విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి ఉన్నత భవిష్యత్తుకు ఎదగగలరని వారు ఆకాంక్షించారు. డిఆర్‌పి పృధ్వీరాజ్ మాట్లాడుతూ పాఠశాల కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రుల సూచనలు, సలహాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. పాఠశాలలో సామాజిక తనిఖీ బృందం రెండు రోజులపాటు ప్రతి అంశాన్ని పరిశీలించిందని, పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తికరంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సామాజిక తనిఖీ బృందం, పాఠశాల ఉపాధ్యాయులు, ఎస్ఎంసి కమిటీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : డిడి

వీరబల్లి: గొర్రెలకు నట్టల నివారణ మందు తాపిస్తున్న డిడి మాలకొండయ్య

ప్రజాశక్తి-వీరబల్లి

గ్రామీణ ప్రాంతాలలో పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు డిడి మాలకొండయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ నాయినివారిపల్లి, రెడ్డివారిపల్లిలో పశు వైద్యశాల వద్ద పశువైద్యులు డాక్టర్ నాగరాజు, వి.ఎ.చెర్నూరు ఆంజనేయులు ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1850 గొర్రెలకు, 340 మేకలకు, 25 ఆవులకు, 14 పెయ్య దూడలకు, 10 గేదెలకు, 11 పొడ్డ దూడలకు, నట్టల నివారణ మందు ఉచితంగా తాపించినట్లు తెలిపారు. పాడిపశువుల్లో పాల ఉత్పత్తి పూర్తి సామర్థ్యం పొందాలంటే మేలైన నాణ్యమైన పశు గ్రాసాలను పచ్చిమేతగా అందించాలి. దానాకన్నా పచ్చని పశుగ్రాసాలను మేతగా అందిస్తే అధిక పాల దిగుబడి సాధించడంతోపాటు పాడి పశువుల్లో రోగ నిరోధక శక్తిని పెంచిన వారవుతాం అన్నారు. ఉపాధి హామీ పథకం కింద పశుగ్రాసం పెంచడానికి వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని అన్నారు. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు ఉండి 10 సెంట్లు తగ్గకుండా సొంత భూమి రైతులంతా ఈ పథకం కింద లబ్ధి పొందడానికి అర్హులన్నారు. ప్రతి మండలంలో 40 నుంచి 50 ఎకరాల వరకు పశుగ్రాసం పెంపకానికి పశు వర్ధక శాఖ అధికారులు రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్నారని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు సమీపంలోని పశు వైద్య కేంద్రాలతో పాటు, రైతు సేవ కేంద్రాలలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సర్పంచ్ గోపీనాథ్ రెడ్డి, టిడిపి యువ నాయకులు భాస్కర్‌రాజు, హరినాథరెడ్డి, మల్లికార్జున రెడ్డి, జయ చంద్రారెడ్డి, శివయ్య, రామచంద్రయ్య, మహేశ్వర, పవన్ కుమార్, చంద్రశేఖర్, మల్లేష్, గ్రామ ప్రజలు, విఎల్ఒ జయప్రకాష్, విఎలు ఆంజనేయులు, గణేష్, నాగేంద్ర, శశాంక్, సిద్ధమ్మ బాల కళ్యాణ్, ప్రియాంక, మౌనిక, పాల్గొన్నారు. **రామాపురం :** మండలంలోని గోపగుడిపల్లి పంచాయతీలో కాంపల్లె దళితవాడ, కసిరెడ్డిగారి పల్లె పంచాయతీ కొత్తరోడ్డు నారాయణపురంలో మంగళవారం పశు వైద్యా ఆరోగ్యం శిబిరం మండల పశువైద్యాధికారి ప్రవీణ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా102 పశువులకు ప్రథమ చికిత్స చేశారు. గర్భకోశ వ్యాధుల సమస్యలున్న ఆరు పశువుకు చికిత్స అందించారు. 134 ఆవులు, 83 గేదెలకు, 2058 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులకు చలి కాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువులు మేపు తినకున్నా చర్మంపై నల్ల కప్పు చేసినట్లు ఉన్న వెంటనే పశువైద్యశాలకు వెళ్లి వైద్యుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉలవ పంటను పరిశీలిస్తున్న డిఎఒ చంద్రానాయక్

ఇకెవైసి తప్పనిసరి : డిఎఒ

ప్రజాశక్తి-కలకడ

ప్రతి రైతు ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ సూచించారు. మంగళవారం మండలంలోని కె.దొడ్డిపల్లి పంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలోని రైతులు తమ తమ పొలాలకు సంబంధించిన ఇకెవైసి చేసుకోవాలన్నారు. ఇకెవైసి చేసుకుంటే కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. రైతులకున్న సమస్యలను సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. పంటలకు ఆశించే చీడ పురుగులు, తెగుళ్ల ఉధృతిని ఎన్‌పిఎస్ఎస్ యాప్‌తో నివారణకు చర్యలు తెలుసుకోవచ్చని రైతులకు తెలిపారు.ఉలవ పంట రికార్డులను క్షేత్రస్థాయిలో దిగుపాలెం, దేవులపల్లి, ముడియంవారిపల్లి, దొడ్డిపల్లి గ్రామాలలో తనిఖీలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టెక్నికల్ ఎఒ వెంకట మోహన్, మండల వ్యవసాయ అధికారిని ఎంవి.లావణ్య, రైతు సేవ సిబ్బంది అమృత్ కుమార్‌రెడ్డి, శ్రావణ్ కుమార్, రెడ్డి కుమార్, రైతులు పాల్గొన్నారు.

నేడు పుల్లంపేట మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల ప్రజా పరిషత్ సభ భవనంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎఒ శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ఎంపిపి ముద్దా బాబుల్ రెడ్డితో పాటు ప్రజాప్రతినిధులు అందరూ హాజరు అవుతారని పేర్కొన్నారు. మండల అభివృద్ధిపై చర్చ జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశానికి మండలానికి సంబంధించిన అధికారులు ప్రగతి నివేదికలతో తప్పని సరిగా హాజరు కావాలని సూచించారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

ప్రజాశక్తి- కొత్తకోట

రహదారి భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని వాహనదారులకు బి.కొత్తకోట సిఐ జీవన్ గంగానాథ్‌బాబు సూచించారు. ఎస్‌పి విద్యా సాగర్ నాయుడు ఆదేశాల మేరకు మంగళవారం బి.కొత్తకోట సిఐ తన సిబ్బందితో కలిసి విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహిస్తూ, ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వలన కలుగు ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ విన్యాసాలు చేస్తున్న మైనర్లను గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించారు. మరలా ఇది పునరావృతం అయిందంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లేనియెడల చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఆక్వా అభివృద్ధికి ప్రభుత్వం బాటలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్రంలో వ్యవసాయంతో పాటు ఆక్వా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాజంపేట టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు తెలియజేశారు. మంగళవారం మండల పరిధిలోని పోలి చెరువులో పోలిచెరువు చైర్మన్, టిడిపి శ్రేణులతో కలిసి చమర్తి ఐదు లక్షల చాప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువులు నీటితో కలకలాడుతున్నాయంటే ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలే కారణమని, చెరువులు నింపడానికి కాలువలను ఆధునికరించి ప్రతి నీటిబొట్టు వృధా కాకుండా చెరువులు కలకల్లాడేలా చర్యలు తీసుకుంటున్నామని, చెరువుల్లో చేప పిల్లలను వదిలి అటు వ్యవసాయ రంగంతోపాటు ఇటు ఆక్వా రంగాన్ని కూడా అభివృద్ధి దిశగా నడిపించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని తెలియజేశారు. భవిష్యత్తులో ప్రతి రంగాన్ని అభివృద్ధి దిశగా నడిపించి పారిశ్రామిక అభివృద్ధితో రాష్ట్రాన్ని దేశంలోని మొదటి స్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, ఆయన అడుగుజాడల్లో తాము కూడా ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి దిశగా నడిపించేందుకు ముందుకు సాగుతామని తెలియజేశారు. కార్యక్రమంలో రాజంపేట టిడిపి పట్టణ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, రూరల్ అధ్యక్షులు సుబ్బనరసయ్యానాయుడు, మండల ఉపాధ్యక్షులు ఆర్.సతీష్ రాజు, పోలి చెరువు నీటి సంఘం అధ్యక్షులు నాగేశ్వర్ నాయుడు, టిడిపి మాజీ మండల అధ్యక్షులు పొందూరు కొండయ్య నాయుడు, కమ్మ సంఘం అధ్యక్షులు శివ నారాయణ నాయుడు, పోలి చెరువు వైస్ చైర్మన్ పెంచలయ్య, మాజీ ఎంపిపి బాపనయ్య నాయుడు, టెక్సమో మల్లిఖార్జున నాయుడు, వాణిజ్య విభాగం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం నాయుడు, దాసరి కళాధర్, సీతారామపురం సర్పంచ్ చైతన్య, తెలుగు యువత అధికార ప్రతినిధి పరశురాం నాయుడు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు సిఎం సహాయనిధి చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, వరలక్ష్మి

పేదలకు వరం సిఎం సహాయనిధి

ప్రజాశక్తి-చిట్వేలి

పేదలకు సిఎం సహాయనిధి వరం లాంటిందని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పేర్కొన్నారు. మండలం మైలంపల్లి గ్రామానికి చెందిన చెవ్వు వెంకటరెడ్డి కుటుంబానికి రూ.50వేల చెక్కును కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మితో కలిసి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న వారికి సిఎం సహాయనిధి ఎంతగానో తోడ్పాటునిస్తుందని అన్నారు. అభాగ్యులకు అండగా ఉంటామని అర్హులైన వారు సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు సౌకర్యం కావాలని ప్రజలు అడగటంతో ఏర్పాటు చేయిస్తామని చెప్పారు. కార్యక్రమం లో రాజుకుంట సర్పంచి గుత్తి నర్సింహులు, కూటమి నాయుకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రేపు ఉపాధి హామీ సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-వీరబల్లి

19వ విడత సామాజిక తనిఖీ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ పనుల పైన బహిరంగ సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ నూర్జహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపిడిఒ నూర్జహాన్ అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, ప్రజలు, రైతులు, ఉపాధి కూలీలు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయత్ రాజ్ సిబ్బంది, వెలుగు సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు, హౌసింగ్ సిబ్బంది, ఆర్డబ్ల్యుఎస్, మండల అధికారులు, హాజరు కావాలన్నారు. మండలంలోని 12 పంచాయతీల 01.4.2023 నుంచి 31.3.2024 జరిగిన పనులపై 17.1.2025 నుంచి 29.1.2025 జరిగిన పనులపై 30.1.2025 ఉదయం 10 గంటలకు సామాజిక తనిఖీ సమావేశం జరుగుతుందని తెలిపారు.

మహాశివరాత్రి వేడుకలకు కలెక్టర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని బీరంగి పంచాయతీ,గూగూటికోనలో వెలసిన బండెన్నస్వామి ఆలయంలో ఫిబ్రవరి 26న జరిగే మహాశివరాత్రి వేడుకలకు హాజరుకావాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరిని బండెన్నస్వామి ఆలయ పీఠాధిపతి పగడాల లక్ష్మీపతి స్వామి ఆహ్వానించారు. మంగళవారం రాయచోటిలోని కలెక్టర్ కార్యాలయంలో ఆహ్వాన పత్రికను అందించినట్లు తెలిపారు. గూగూటికోన విశిష్టత,అక్కడ ఏర్పాటు చేసిన 251 విగ్రహాల గురించి కలెక్టరుకి వివరించారు. ప్రతి ఏడాది ఎంతో ఘనంగా శివరాత్రి వేడుకలను నిర్వహిస్తున్నామని,అదే స్ఫూర్తితో ఈ ఏడాది ప్రతిష్టాత్మకంగా మహాశివరాత్రి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రైతులకు శిక్షణ ఇస్తున్న కెవికె సిబ్బంది

కొబ్బరి సాగుపై అవగాహన

ప్రజాశక్తి-కలికిరి

మండల కేంద్రం కలికిరిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో కొబ్బరి సాగు, కొబ్బరి చెట్లు ఎక్కే సైకిల్ పై ఏడు రోజుల శిక్షణ కార్యక్రమం కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆరు రోజులపాటు కొబ్బరి సాగు రకాలు, ఎరువుల యాజమాన్యం, పురుగులు తెగుళ్ల యాజమాన్యం, కొబ్బరి పోషక విలువలు, కొబ్బరి సాగులో ఖర్చు మార్కెట్ డిమాండ్ గురించి రోజు వారీగా తరగతులు నిర్వహిసామని తెలిపారు. కొబ్బరి సైకిల్ ఎక్కడంలో శిక్షణ ఇవ్వటానికి కోకోనట్ డెవలప్మెంట్ బోర్డు తరపున వచ్చిన మాస్టర్ ట్రైనర్స్ కె.రఘు, కె.శ్రీను సైకిల్ వాడకం గురించి అవగాహన కల్పించారు. సైకిల్ వాడకంలో ఏదైనా ఇబ్బంది ఏర్పడితే ఇన్సూరెన్స్ కవరేజ్ గురించి సిడిబి తరఫున మొదటి సంవత్సరం శిక్షణ తీసుకున్న రైతులకు ఉచితంగా ప్రీమియం ఉంటుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ వై.పీరుసాహెబ్, డాక్టర్ యస్.సోమశేఖర్ బాబు, డాక్టర్ కె.నవీన, డాక్టర్ కె.మాధురి, 20 మంది రైతులు పాల్గొన్నారు.

'సుంకర'ను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి-గాలివీడు : ఉమ్మడి కడప జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సుంకర శ్రీనివాస్‌ను మంగళ వారం కడప జిల్లా కార్యాలయంలో మండల జనసేన పార్టీ సీనియర్ అధ్యక్షులు గేట్ బాబ్జి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గ పార్టీ కార్యాచరణ, నామినేటెడ్ పోస్టులు తదితర విషయాలపై చర్చించినట్లు తెలిపారు. అనంతరం అధ్యక్షున్ని ఆయన శాలువాతో ఘనంగా సత్కరించి పూలబోకే అందించారు. కార్యాక్రమలో పఠాన్, ప్రదీప్, కొండయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

కెజిబివిని సందర్శించిన 'దాసరిపల్లి'

ప్రజాశక్తి-ములకలచెరువు : మండల కేంద్రం ములకలచెరువులోని కెజిబివి పాఠశాలను మంగళవారం సాయంత్రం టిడిపి ఇన్‌ఛార్జి దాసరపల్లి జయచంద్రరెడ్డి సందర్శించారు. సోమవారం ఇదే విద్యా కేంద్రంలో జరిగిన సామాజిక తనిఖీ నేపథ్యంలో కెజిబివి విద్యా కేంద్రంలోని మొత్తం 237 మంది విద్యార్థుల, ఆహారం, ఆరోగ్య, సౌకర్యాలలో ఉన్న సమస్యల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు విద్యార్థులపట్ల శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు శ్రద్ధ తీసుకోక పోతే పాఠశాలకు, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి చెందినట్లు ముదివేడు ఎస్ఐ దిలీప్ కుమార్ తెలిపారు. కురబలకోట మండలం, కనసానివారిపల్లికి చెందిన రామచంద్ర, రెడ్డెమ్మ దంపతుల కుమారుడు రవి(23) ఇంటి కోసం సోమవారం జరిగిన ఘర్షణలో తన తల్లిని దూషించడంతో మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగతి తెలిసిందే. తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న రవి పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

15 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి: నాటు సారా విక్రయస్థావరం పై మంగళవారం నిమ్మనపల్లి పోలీసులు దాడులు నిర్వహించారు. సారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులును అరెస్టు చేసినట్లు ఎస్ఐ సి.తిప్పేస్వామి తెలిపారు. మంగళవారం ఉదయం తవళం పంచాయతీ సమీపంలో తవళం గ్రామానికి చెందిన తలారి ఎల్లారెడ్డి, నాగులయ్యగారిపల్లెకు చెందిన నాగరాజు నాటుసారా తయారు చేసి విక్రయిస్తుండగా పోలీసులకు సమాచారం అందడంతో తన సిబ్బందితో కలిసి దాడులు చేసి వారి వద్ద నుంచి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటు సారా విక్రయిస్తూ పట్టుబడ్డ నిందితుల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలో నాటుసార తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారి పై కఠిన చర్యలు తప్పవన్నారు.